# వల

మాచన్న సంజీవరెడ్డి

**లస్మికి** చిన్న గున్నప్పుడే పెళ్ళయింది.

ఒక్క దినం పొద్దుగల్ల—"అవ్వా! నాకు పెండ్లి జెయ్యే" అని తల్లి ఈపు మీన చేతులు వెట్టి పిప్పరమెట్టు కొనియ్యమన్న ట్టడిగింది లస్మి.

"అసి నీ పాపంల మున్నపడ! నీ ఈడెంతనే? గిప్పుడు పెండ్లెందుకే నీకు!" నవ్వుకుంట బిడ్డను జూసి నోరు దెరిచింది తల్లి.

"వూఁ. హూఁ. వూఁ. నాకు పెండ్లి గావాల్నె!" పిప్పరమెట్టును కొనియ్యకపోతే ఏడ్చినట్టేగనే ఏడ్చింది.

"వూకోమె! వూకోమల్ల. గట్లనే తియ్యి. నీ పెండ్లి జేస్తం గని గిప్పుడే గాదు..." కోపంతోని కొంత, నవ్వుతోని కొంత బిడ్డను సముదాయిస్తున్నట్టు గన్నది తల్లి.

"ఎప్పుడు మల్ల?" లస్మి అడిగింది కండ్లళ్ళకు రాని నీళ్ళను దుడుసుకుంట.

"అయ్య నీకు పిలగాన్ని జూస్తుండే—పిలగాడు మంచిగనే ఉన్నడంట. రెండెకరాల పొలం గూడుందట. మనూరు పక్క వూరే బాగుడమంట. ఒచ్చే ఎండల్ల జేస్తం నీ పెండ్లి." తల్లి మురుసు కుంటనే జెప్పింది. లస్మిగూడ మురుసు కుంటనే ఇన్నది. ఆ మురిపెంనే తల్లి చెంపకు ముద్దు వెట్టింది. తల్లికూడా బిడ్డకు ముద్దు లెట్టింది.

లస్మి పెండ్లెందుకు జెయ్యి మంటుందో తల్లికి సమజ గాలేదు. నిజంగనే లస్మికి పిలగాన్ని జూసిండ్రు గనుక ఉన్న సంగతి జెప్పింది గంతనే!

లస్మికూడా ఆ దినందాక పెండ్లి జేసుకోవాల్నన్న క్యాలే లేకుండే. బళ్ళె తనతోని సదువుకునే ఎట్టాలుకు పెండ్లయ్యింది. ఎట్టాలు పెండ్లికి లస్మి పొయ్యింది. పచ్చగ పెండ్లి పందిరేసిండ్రు. ఎట్టాలుకు మంచి మంచి సీరలు వెట్టిండ్రు. తెల్ల చీర గట్టిచ్చిండ్రు. మెడల బంగారం గొలుసేసిండ్రు. మొగనితోని మెడల పుస్తె గట్టి పిచ్చిండ్రు. డప్పు చప్పుల తోని వూరంతా బండ్లె ఆల్లిద్దర్ని తిరిగి పిచ్చిండ్రు.

గదంతా లస్మి జూసింది. లస్మిగ్గూడా పెండ్లి జేసుకోవా ల్ననిపిచ్చింది. సీర గట్టుకోవాల్ననిపిచ్చింది. బంగారం గొలుసేసుకోవా ల్నని పిచ్చింది. పుస్తె గట్టిపిచ్చుకోవా ల్ననిపిచ్చింది.

ఇంతజేస్తే లస్మి ఈడు పదేండ్లు! పెండ్లయిన ఎట్టాలు ఈడుకూడా పదేండ్లే!

తల్లి అన్నట్టుగానే ఎండ ల్లొచ్చినయి. తల్లి జెప్పినట్టుగనే లస్మి పెండ్లయింది. లస్మి మురిసింది. సీరల్ని జూసుకున్నది. బంగారం గొలుసును జూసుకున్నది. పుస్తెను జూసుకున్నది. పుస్తె గట్టిన మొగన్ని జూసుకున్నది. అవ్వ అన్నట్టుగనే పిలగాడు బాగున్నడు. జాంపండోలె ఎర్రగ ముద్దుగున్నడు అని నవ్వుకున్నది.

అత్త గారింటికి పొయ్యింది.

సమురతయ్యింది.

పుట్టినూరు నుంచి అయ్య అవ్వ లడ్డూలు దెస్తె నిమ్మలంగ దిన్నది. కల్లు వోట్టు దెచ్చిస్తే నిమ్మలంగ దాగింది. అయ్య—అవ్వ తాగుతుంటే, అత్త—మామ దింటుంటే, మొగడు అటు ఇటూ జూసుకుంట నవ్వుతుంటే, ఎందేందో అనుకున్నది.

లస్మి నీళ్ళు వోసుకున్నది.

మల్ల పుట్టినూరు నుంచి అయ్య అవ్వ లడ్డూలు దెచ్చిండ్రు. తినిపిచ్చిండ్రు. తాగి పిచ్చిండ్రు. అప్పుడు గూడా నిమ్మలంగ తిన్నది, తాగింది.

లస్మి మొగునికి ఒక దినం జెర మొచ్చింది. మల్లో దినం సావొచ్చింది!

అత్తమామ ఏడిసిండ్రు. అయ్య అవ్వఏడిసిండ్రు. దినాల నాడు మల్లబాగనే తాగిండ్రు, తిన్నరు. నాత్రికి నిమ్మలంగ పన్నరు. తనకే తాగలపించ లేదు, తినాలనిపించలేదు. ఆఖరికి నిద్రకూడా పోవాలనిపించ లేదు.

"పిల్లను నాల్గరోజులు మా దగ్గర్నే ఉంచుకుంట"మని అయ్య, అవ్వ లస్మిని పుట్టినూరికి దెచ్చుకుండ్రు.

లస్మి నీళ్ళాడింది, ఆడివోరి పుట్టింది.

అల్లొచ్చింది. మల్ల ఆలూర్లరికి దొలుకపొయ్యింది.

అత్తగారిల్లు జూస్తున్న వోద్దుగ అన్ని ఒకటొకటి గుర్తుకు రావట్టినయి లస్మికి. తను పెండ్లి జెయ్యమని అడుగుడు. అవ్వ ఎండల్ల పెండ్లి జేస్తననుడు, ఎండల్ల పెండ్లయి పోవుడు. తను సమురతవుడు. అయ్య, అవ్వ లడ్డూల్కు గిడ్డూలు దెచ్చుడు. తను నిమ్మలంగ తాగుడు, తినుడు. అప్పుడప్పుడు దొంగ లెక్క తన మొగుడు పక్కల కొచ్చి పండుకొనుడు. తను నీళ్ళు వోసుకునుడు. మొగడు సచ్చుడు. తను నీళ్ళాడుడు. మల్ల అత్తగారింటికి వచ్చుడు.

ఇవన్నీ వెంట వెంటనే గుర్తొచ్చి లస్మి కండ్లు నీళ్ళల్ల మునిచి నట్టయినయి.

● ● ● ●

ఒక దినం పొద్దుగల్ల.

గుడి అరుగు మీద పోలీసు పటేలు, మాలీసు పటేలు, పట్వారి—ఇంకొందరు పెద్దమనుషులు కూసున్నారు.

గుడి అరుగుకు జెరంత దూరాన కింద దుబ్బుల తన కులపు పెద్దలు ఆడోళ్ళు, మొగోళ్ళుకూసున్నారు.

సుట్టూత వూర్లె మంది నిలవడ్డరు.

గుడి అరుగు మీది పెద్దమనుషులు గుడి గురించి, దాని అభివృద్ధి గురించి మాట్లాడుకుంటున్నారు. కింద గూసున్న తన కులపోళ్ళు గొర్ల గురించి, పొలాల గురించి ముచ్చట్లు వెట్టుకుంటున్నరు

అటు దిక్కు కెల్లి సత్తిగాడు ముంద టొచ్చిండు. ఆ వెనుక కావలోడు, అవెనుక లస్మి వచ్చింది.

జెర్రసేపు అదీ ఇదీ మాట్లాడుకున్నరు పెద్ద మనుషులు. అవెనుక పోలీసు పటేలు మెల్లగా సత్తిగాని దిక్కు జూసిండు.

"ఏంరా సత్తి! నాత్రి దానింట్ల పన్నవట—ఏం సంగతి?" అన్నాడు.

సత్తిగాడు సప్పుడు జెయ్యలేదు.

"దానికి మొగడు జచ్చి పోయిండని తెల్వ గద్దా నీకు?"

సత్తిగాడు ఏం మాట్లాడలేదు.

"గీల్లు ముండమోసినోళ్ళ తాన పన్నవంటే ఏమన్నట్టురా? వూరెం గావల్ననుకున్నావురా?"

సత్తిగానికి సమజ గాలేదు. తను మొగడు జచ్చిన లస్మి దగ్గర పడుకంటే వూరెందుకు ఏమైతదో అనుకున్నాడు.

"సప్పుడు జెయ్యవేందిరా బెకూవ్!" కస్సున లేసిండు పోలీసు పటేలు—తను గిన్నిమాట లడిగినా ఒక్క దాన్కి జవాబియ్య డేందని.

"దాన్ని పెండ్లి జేసుకుంట నేను." గట్టిగనే అన్నాడు సత్తిగాడు.

పోలీసు పటేలుకు ఇంగేమనాలో తెల్వ లేదు. సత్తిగాడిది లస్మిది ఒకే కులమే. గందుకని మాట్లాడుకుంట గూసున్నడు. లస్మి దిక్కుజూసిండు. "మరి నీ కిష్టమేనాయె" అన్నాడు. 'ఆ' అండ్లేందు, 'వూ'అని కూడా అండ్లేదు.

"అది సెరం దప్పిన లంజె! అది మా జేసు కుంటది. నీ కెందుకు సెరం లేదురా లంగలమ్డీ కే! చెప్పు దీసుకుని కొడ్త లంజకొడక!" సత్తిగాని అయ్య లేసొచ్చి వాలు గంటిచ్చిండు సత్తిగాని.

దెబ్బలు వడ్డ సత్తిగాడు సప్పుడు జెయ్యలేదు. 'నేను జేసుకుంట నువ్వేవలివే' అండ్లేదు.

"ఏంరా! మీ అయ్య గట్లంటుండు. నువ్వు లస్మిని జేసుకుంటవా మల్ల!" పోలీసు పటేలు అడిగిండు.

తలకాయ అడ్డం దింపిండు సత్తిగాడు. సత్తిగాని అయ్య ఎప్పటి లెక్కనే మునిపటి జాగలకు వొయ్యి కూసోని..."నా మాట దప్పుతా డాడు" అన్నాడు. పటేలు మల్ల మొదలు పెట్టిండు లస్మి దిక్కు జూసి.

"బద్మాష్ లంజె! గట్ల ఎవర్ని వడితే ఆళ్ళని పండ వెట్టుకుంటావే, సెరం దప్పిన ముండ! నీకు సిగ్గు లేదే" అన్నాడు. లస్మి తల వంచుకుని నిలవడ్డది సప్పుడు జెయ్యలేదు.

సత్తిగాని అయ్యదిక్కు జూసి"అరేయ్ గిటువంటి తప్పుడు పనులు జేసిన నందుకు మీ వోనికో వంద, ఆ లంజెముండకో వంద ఏస్తున్న. దానికి మొగడు గిన్నెవలు లేరు గనుక దాని పైసలు నువ్వే గట్టాలె" అని లేసిండు. ఆవెనుక అందరూ ఎవలిండ్లళ్ళకు ఆళ్ళు ఎళ్లిపోయిండ్రు.

● ● ● ●

దివాలుగడుస్తున్న కొద్దీగ లస్మికి మొగుడు లేని ఎలితి తెల్సొడు మొదలయ్యింది. ఒంటిగ లస్మికి ఉండ బుద్ధి గాలేదు. వూకే మొగడు కండ్లల్లనే తిరిగి నట్టనిపిస్తుంది. పుట్టినూర్లె అయ్య అవ్వ గుర్తుకు రావట్టింన్రు. ఒక్కొక్క దినం ఏడ్పొస్తుండే— ఏడుస్తుండే.

గిట్లుండగనే ఇంటి ముందటి సెంద్రిగాడు, ఇంటెనుక మల్లిగాడు వూకెజూడవట్టింన్రు లస్మిని— నీళ్ళకు వోతున్నప్పుడు నీళ్ళు దెస్తున్నప్పుడు.

గట్ల సూసుడు వోయి మెల్లంగ మాట్లాడ బట్టింన్రు.

లస్మిగ్గూడ ఆళ్ళను సూడ బుద్ధయింది. ఆళ్ళు మాట్లాడుతుంటే మంచిగనే మాట్లాడ బుద్ధయింది.

గట్లుండగనే ఒక దినం లస్మి అత్త జెర మొచ్చి పన్నది. సెంద్రిగాడు, మల్లిగాడు గది దెలుసుకుని ఒక తీర్గనే డక్టర్‌ను తీసుకొచ్చి సూదుల మీద సూదు లిప్పిచ్చింన్రు లస్మి అత్తకు. గన్నిసూదులు నొప్పికి ఓర్వకనేమో ఒకదినంపన్నది ఉన్నట్టుగానేవ మల్ల లెవ్వకుండ కాట్లెకు వోయింది.

లస్మికి వున్నొక్క తోడు వోయ్యింది. సెంద్రిగాని తోని, మల్లిగాని తోని ఉన్న రొండెకరాల పొలం దున్ని పిచ్చి ఎవసం మొదలు పెట్టింది.

గట్ల గట్లనే మెల్లంగ లస్మి ని రాత్రి పూట సూసుడు మొదలు వెట్టిండు సత్తిగాడు. లస్మి ఇగ ఏమండ్లేదు.

గట్ల రొండేండ్లు బాగనే నడిసింది. గని, మెల్లంగ మెల్లంగ ఈ సంగతంతా వూళ్ళె దెల్సుడు మొదలువెట్టింది. దాంతోని ఒయిసుపోరలు రాత్రి పూట లస్మి దగ్గర కొచ్చుడు మొదలు పెట్టింన్రు. పది పదిహేను చేతుల వెట్టింన్రు. గింజలుగిన సాటుకు దెచ్చి పోసింన్రు.

గట్ల లస్మికి పైసలు జమయినయి. గింజలు జమయినయి. సుఖం గూడ జమయ్యింది!

గిదంత పటేలుకు దెల్సింది. లస్మి పని జెయ్యాల అనుకున్నడు. గంతే! రాత్రికి రాత్రి కావలోళ్ళని కావలి గాపిచ్చి లస్మిని, సత్తిగాని పట్టి పిచ్చిండు!

• • •

రాత్రయ్యింది.

గొంకొయిలు నెత్తిమీది కొచ్చియి.

పటే ల్లేసి లస్మి ఇంటి తొవ్వ పట్టిండు.


దర్వాజను గొల్లెంతోని గొట్టిండు.

లస్మి లేసొచ్చి దర్వాజ దీసింది. పటేలును జూసి నోరు దెరిచింది.

పటేలు లోపటికి ఒయ్యి దర్వాజ మూసిండు. ఇంట్లకు నడిసిండు. పటేలెనుక లస్మి నడిచింది.

లస్మి పరుసుకున్న పక్క మీద గూసుండు. లస్మి దిక్కు జూసిండు. "దీపం ఒత్తిని పెద్దగ జెయ్యే" అన్నడు. లస్మి గాంచుసూనే దీపాన్ని పెద్దగ జేసింది. లస్మిని దగ్గరికి పిలిసి పక్కన గూసోమన్నడు. లస్మి అట్లనే జేసింది.

దీపం ఎలుగుల లస్మి చెయ్యి ముద్దుగన్పించింది పటేలుకు అందుకున్నడు లస్మి చెయ్యిని. లస్మి ఒణికింది చిన్నగా.



లస్మి కండ్లళ్ళకు జూసిండు. దీపం లెక్క ముద్దుగున్నయి.

సిగ్గయ్యింది లస్మికి. కండ్లు మూసుకుంది.

"గసొంటి లంగలమిడ్డి కొడుకులను నీ దగ్గర పండవెట్టుకుంటావే?" అన్నడు పటేలు— లస్మి చెవుల కాడ మూతి వెట్టి.

లస్మి సప్పుడు జెయ్యలేదు. పటేలు మూతి చెవులను తాకుతుంటే సక్కిలి గింతయ్యింది లస్మికి.

పటేలు మెడ సుట్టూ సేతులేసింది.

లస్మి పిచ్చిది.

పటేలు తన అందాన్ని మెచ్చిండనుకుంటున్నది. గందుకనే పంచాయితీల తనిచ్చే జుర్మానాని ఆళ్ళతోని గట్టి పిచ్చిం డనుకుంటున్నది. గందుకనే ఈ రాత్రి కొచ్చిండని కూడా అనుకుంటున్నది.

ఇంగ పటేలు తనోడయ్యిండు. ఎవలొస్తేని తనకేం పనిలేదిగ అనుకున్నది. పటేలున్నట్టుగా గసొంటి లంగ గాళ్ళతోనేం? అయ్యల నెదిరియ్యాని బాడ్కావ్‌లు అనుకున్నది.

క్కాని, పటేలు లస్మి అందాన్ని మెచ్చి రాలేదు. లస్మిని ఒల వేసుకుందామని వచ్చిండు!

• • • •

పటేలు రాక రొండు మూడు రోజులయ్యింది. ఏడికి వోయ్యిండో? ఆవ్? గుంజొచ్చింది. పొద్దున కలుపు చేండ్లెవలో అన్నరు — పటేలు పట్నం బోయిండని.

పట్నంబోతే ఒట్టి చేతులొస్తని రాడు పటేలు. పోయినప్పుడల్లా ఏదో ఒకటి దెస్తనే ఉన్నడు— పోడరు డబ్బులు. సునో సీసలు మంచిగాసనొస్తయని.

ఒకసారి గోళ్ళరంగు సీస దెచ్చిండు. ఒద్దు, పట్నా!

గదేందుకన్నా. ఇన్నేడు. గోళ్ళకు పటేలె రంగు పెట్టేండు. తన కేమో సిగ్గయ్యింది. బయ టెవల అడిగితే ఏం జెప్పాలని పొద్దున లేసి గీకేసింది.

మల్లోసారి బొట్టు పెట్టుకునే సీసదెచ్చిండు. కాటుకగూడ దెచ్చిండు. మొగుడు సచ్చినోళ్ళుగివన్ని పెట్టుకోవద్దు, పటేలా అంటే గూడిన్నేదు.

'నేను మొగున్నిగానాయె!'అన్నడు. బొట్టు పెట్టుకుని కాటుక దిద్దుకుంటే బాగుంటవని ఆ వ్రాతి బలవంతంగా పెట్టి సిచ్చిండు. నిజంగానే అందగ్గవిపించింది అవన్నీ పెట్టుకుంటే. పొద్దున్నే లేచి అవన్నీ తీసేసింది తనే బాగుండదని.

తన సొంత పెళ్ళాం కన్న ఎక్కువగా జూసు కుంటుండు. పటేలుకు తను పానంల పానం అయిపోయింది.

దర్వాజ సప్పుడయ్యింది.

లస్మి దబుక్కున దీసింది. పటేలే! పటేలు సేతు లేమో ఉంది.

"ఏంది, పటేలా, అది?"

"సీరనే— నీకు సీర దెచ్చిన."

"పట్నంబోతే నువ్వుట్టిగరావని దెల్సు, పటేలా!" నవ్వుకుంట అని దర్వాజ గొళ్ళెం బెట్టి పటేలెంట ఇంట్లోక పొయ్యింది.

పటేలు సీర విప్పిండు. చిలకాకు పచ్చరంగుల మంచిగుంది సీరు. లస్మి కండ్లు మెరిసినయ్.

"ఎంత వడ్డది? పటేల, సీర" అన్నది నవ్వు కుంటనే.

"రొండు వందలే" అన్నాడు పటేలు.

చిన్నగ చిన్నగ నవ్వుకుంటనే 'రొండువందల సీర తన కోసం దెచ్చిండు పటేలు' అనుకుంట మెత్తగా పక్క పరిసింది లస్మి.

"నువ్వు గట్టుకోయే సీరిప్పుడు."

"ఎందుకు తియ్యి, పటేల, రేపు గట్టుకుంట."

"ఇప్పుడే గట్టుకోయె—ముద్దు గుంటవు కొత్త సీరల."

పటేలు మాట దీసేసుడు ఇష్టం లేక మురుసు కుంట గోడసాటుకు వొయ్యి చీర గట్టుకొచ్చింది లస్మి.

"రంబ లెక్కున్నవే, లస్మి" అనుకుంట లస్మిని కాగలిచ్చుకుండు పటేలు.

లస్మికి సిగ్గయ్యింది. పక్కమీద ముడుసుకుని కూసుంది.

పటేలు ఎనక్కెంచి వచ్చి లస్మి చెంపల్ని ముద్దు పెట్టుకున్నడు.

లస్మి కిసకిస నవ్వుకుంట ఎల్లెంకల పన్నది. పటేలు గూడ నవ్వుకుంటనే లస్మి మీన తలవెట్టి పన్నడు. లస్మి కండ్లళ్ళకు జూసిండు. లస్మి రొండు సేతులతోని పటేలు నెత్తి నిమిరింది.

"లస్మీ! నే నొకటి అడగత—ఇస్తవే?"

"అడుగు, పటేలా! నీకు నే నియ్యందేంది సెప్పు. నీ కంటె నా కెక్కువ ఎవలుండ్రు సెప్పు."

"గదేనే ... ఇల్లు గడుతున్నగద. దానికి జెర్రన్ని పైసలు దక్కువ వడ్డయి. ను వ్వేమన్న మద దాయిస్తవేమోనని."

"గంతేనా, పటేలా! గాయింతదానికి నన్నడుగతం దుకు బయపడ్తన్నావ్. నా దగ్గరున్నయి తీసుకపో. నువ్వొకటి, నేనొకటా! రేపు పోరి పెండ్లికి నువ్వే మన్న సాయం జెయ్యవా?!"

"అట్లనే! ఆ పెండ్లెందుకు జెయ్య! నీ పోరయితే నా పోరిగాదా!?"

"నా దగ్గర రొండెయ్యిలవ రున్నాయి. అవి దీసుకపో. పిల్ల పెండ్లికియ్యి. ఏమన్న తక్కువడితే కలేద్దాము గాని."

"గట్లనేనే. గట్లనే. అవి తీసుక రాపో. పోతిగ."

"అయ్యో గప్పుడెనా, పటేలా! రొండు మూడు రోజులాయె నువ్వులేక. కోడికూసె దాంక నన్న వండుకో, పటేలా—"

"ఒద్దే — పోవాల్నె ఆ దెదురుమున్నది. మల్ల రేపొస్త గద."

లస్మి లేసి పొయ్యి కుండల దాసెట్టిన రొండెయ్యిలన్నర దీసుకొచ్చి పటేలు కిచ్చింది.

పటేలు పైసలు జేవుల పెట్టుకొని లేసిండు.

పటేలును గనుమల్ల దాక సాగదోలొచ్చి బిడ్డ దగ్గరకు వొయ్యి పన్నది లస్మి. బిడ్డను దగ్గరకు


# UMESH
## YOGA DARSHAN

**(Part 2)**
**Author : YOGIRAJ SHRI UMESH CHANDRAJI**
**(English or Hindi Editions (Price : Rs. 30/- Postage : Rs. 5/- extra).**

This is an excellent TREATISE on YOGA, providing lucidly written information on such subjects as 'Pranayama' (Breath Control), Abstraction, Concentration, Meditation and various stages of 'Samadhi' (Super-Conscious State) with clear illustrations. This book, based on the personal experience of the author, shows how one can awaken the Kundalini Power, within oneself.

**SHRI RAMTIRTH YOGASHRAM**
Dadar (C. Rly.), Bombay-400 014. Phone: 463209.



## ఇంటి సినిమా యంత్రం
**(SILENT MOVIE)**
## ధర రూ. 150



సినిమా ఫిలిం రీళ్ళు కూడా మా వద్ద లభ్యమౌతాయి. ప్రొజెక్టర్ మరియు సినిమా ఫిలిం ధరల జాబితాకు సమగ్ర కేటలాగ్ పుస్తకానికిగాను రూ. 2-50 కు పోస్టేజి స్టాంపులు పంపండి. ఇంగ్లీషులో మాత్రమే వ్రాయండి.

ఉత్పత్తి దారులు :
**FILM COMPANY**
(Established 1967)
Post Box No. 269
3, Thillaichidambara Nadar Street,
SIVAKASI-626123 Tamilnadu.



— కె.ఎస్.ఎమ్. రాము

అదుముకొని, దాని నొసలిని ముద్దు వెట్టుకుని నిద్రవోయ్యింది.

• • • •

పటేలు ఇంటి ముందట అరుగుమీన గూసున్నడు.

లస్మి ఆటు దిక్కు కెల్లి చిన్నంగా నవ్వుకుంట పటేలు ఇంటి దిక్కు వస్తున్నది.

పటేలు లస్మిని జూసి ఇంట్లకు వోయ్యిండు.

ఆరు రోజుల సంది లస్మి పటేలు ఇంటికి దిరుగుతనే ఉంది. పొల్ల పెండ్లి వెట్టుకున్న వొద్దుగ పటేలును అడుగతనే ఉంది, పైసలియ్యమని. రేపిస్త, మాపిస్త నము కుంట పటేలు అవతల వడ్తుండు. పొల్ల పెండ్లేమో తమాం దగ్గరికొచ్చింది.

పటేలు పీటమీద గూసున్నాడు.

లస్మి పీటదాంకొచ్చి మొగరానికి ఆనుకొని నిలవడ్డది.

"కూసోయే— కూసో, లస్మి!"

"ఎందుకు తియ్యి, పటేలా!" నవ్వుకుంటనే నిలవడ్డది లస్మి.

"లస్మికి చా ఒట్టు దీసుకరాయే!" పెండ్లానికి జెప్పిండు పటేలు.

"గిప్పుడు చా ఎందుకు పటేలా!" ముసిముసిగా నవ్వుతానే ఉంది లస్మి.

పటేలు పెండ్లాం చా దీసుకొచ్చింది.

లస్మి చా దాగింది.

"పొల్ల పెండ్లి దగ్గర కొచ్చింది గద, పటేలా! పైసలిస్తవేమోనని వచ్చిన." మెల్లగా అన్నది లస్మి.

"పైసల కిక్కతుందే ఇంకెవలినన్న అడగక పోయినావు."

"నా కిచ్చేటియే ఇయ్యి, పటేలా! ఎక్కువియ్యకుంటవోతివి."

"నీ కిచ్చేటి దేందీ?"

"అదేందీ, పటేలా! గట్లంటవు? అప్పుడు ఇల్లు గడ్తందుకు పైసలు తక్కువ వడ్డయంటే ఇయ్యలే—? ఒకటి గాదు, రెండు గాదు— రొండెయి అన్నర."

"ఏట్! బద్మాంలంజె—! ఇల్లు గడ్తందుకు నీ దగ్గర పైస లడిగినానే...

పటేలు పీట మీది కెల్లి లేసిండు.

పటేలు పెండ్లాం ఇంట్లకెల్లి ఇదంతా ఇనుకుంట బయటకొచ్చింది. మెల్లంగా వోయ్యి దర్వాజ వెట్టి గొళ్ళెం బెట్టింది.

"గది నీకు నాయం గాదు, పటేలా! ఆయెల్ల రాత్రి నువ్వు పట్నంకెళ్ళి నాకు సీరగూడ దెచ్చినవు. బాగా గుర్తు జేసుకో జెరనువ్వు — సిరకట్టుకోమన్నవు. ఆవెనుక మెల్లంగా 'నిన్నొకటి అడుగత ఇస్తవా' అన్నవు 'అడుగు, పటేలా' అన్న నేను—"

పటేలుకు తిక్క రేగింది. లస్మిని పూర్తిగా చెప్పనియ్యకుండానే — "ఏమె బేవార్స్ లంజె! నేను నీకు సీరె దెచ్చినానే — లంజె మల్లగినంటివి... ఆ ..."దెబ్బ మీద దెబ్బ ఈపులకెల్లి నాలు గంటిచ్చిండు గట్టిగ. పటేలు పెండ్లాంగూడ సీపురుగట్ట దీసుకొని ఇయ్యరమయ్య రంటిచ్చింది — "లంజె? పటేలు నీకు సీర దెచ్చినాడే? నిన్ను గట్టుకోమన్నాడే? నీ దగ్గర పైసలు దీసుకున్నాడే? బద్మాష్ ముండ ...!" అనుకుంట దర్వాజ దీసి బైట కెల్ల గొట్టింది లస్మిని.

లస్మి పస్తాయించింది—పటేలు ఒలల బడ్తగదని — ఆయెల్లనే పైసలు లేవంటే గీ పరేశాన్ ఉండక పోవుగదనని — ఇప్పుడు ఎవలితోని జెప్పుకోవాలె — పటేలు మాటను గాదంటోళ్ళు ఎవలుంద్రు వూళ్ళె — పటేలుకు బుద్ధి జెప్తరా ఎవలన్నా? ?

ఎట్లజెయ్యాలిప్పుడు?

జెరపోరి పెండ్లయితే గాని పటేలు పని జేస్త! పటేలు తనని ఒలలేసుకున్నానని మురుస్తున్నడేమో— పటేల్నుగూడా అదే ఒల లెయ్యకపోతే నే నెవల్ని? తనపేరు లస్మిగాదిగ!!

అనుకుంట ఇంటి తొవ్వ పట్టింది లస్మి.

• • • •

రొండునెల లాయె పటేలు రాత్రి పూట లస్మి ఇంటికి వోక. ఆరం రోజుల సంది లస్మి మీన పానం గుంజుతుంది పటేలుకు. ఎట్లనన్న జేసి ఇయ్యాల రాత్రికి వోదామనుకున్నాడు.

లస్మిగ్గూడ పటేలుమీన పానం గుంజుతనే ఉంది. ఆరం దినాల సంది పటేలు రాక కోసం ఎదురు చూస్తనే ఉంది. రాత్రి పూట నిద్ర గూడ వోత లేదు!

రాత్రయ్యింది.

సవితి సెంద్రున్ని సుక్కలన్నిమింగుదామన్నట్టుగ సూస్తున్నయి.

పటేలు లస్కర్ కెల్లి కొత్తగ గొనుక్కొచ్చిన సీర, రైకను సంకల బెట్టుకుని లస్మి ఇంటి దిక్కున నడుస్తున్నడు.

ఎట్లనన్న ఈ సీర, రైక దాని సేతుల వెట్టి బుదిగిస్తే అది మా ఇంటది. అంత లావయితే గట్ల నా పెండ్లాం ముంద టడుగుతే నాక్కువం రాదాయే! ఇయ్యాల గాక రేపిస్త పైసలు — పైస లేడికి వోతయే అనుకుంట దాని సెంపలు ముద్దువెట్టుకుంటినా అంటే ఏమన దది.

పటేలు లస్మి ఇంటి ముందటి దాంకొచ్చిండు.

మెల్లంగ దర్వాజ గొట్టిండు.

లస్మి దర్వాజ దీసింది— పటేలును జూసి అలిగినట్టుగ మూతివెట్టి ఎనకకు దిరిగింది. పటేలు దర్వాజ మూసి గొళ్ళెం బెట్టిండు. లస్మెంట ఇంట్లకు నడిచిండు.

సీర, రైక దీసి లస్మి కిచ్చిండు.

లస్మి కండ్లు మెరిసినయి.

లస్మి పక్క మీద గూసుంది.

పటేలు గూడ లస్మి పక్కనే గూసుండు. లస్మి ఏమండ్లేదు. సెయ్యి వట్టుకుండు. ఏమండ్లేడు. సెంపల్ని ముద్దు వెట్టుకున్నడు. కిసకిస నవ్వుకుంట ఎల్లంకల షన్నది లస్మి. పటేలుకు దయిర్నమొచ్చింది. లస్మి మీదికి ఒంగి — "నా మీద నీగ్గిన కోపమొచ్చిందేమో నని భయపడ్డనే" అన్నడు.

"నా కెందుకు, పటేలా, కోపం ఇయ్యాల గాకపోతే రేపిస్తవు పైసలు" అనుకుంట పటేలును మీదికి గుంజుకుంది.

గంతే!

గంతదాంక ఇంటెనుక దాగున్న లస్మి మనుషులు అయిదారుగు రొచ్చి పటేలు ఈపుల కెళ్ళి దెబ్బ మీద దెబ్బ ఇయ్యర మయ్యర ఏసింద్రు!

పటేలు లెవ్వకుం టయ్యిండు!

మూల్గుకుంట మెల్లంగ కండ్లిప్పి జూసిండు.

నలుగురూ లస్మి కులపోల్లే— అంతా లస్మి ఇంటి సుట్టూత ఉండేటోల్లే. అండ్ల లస్మితోని పట్టువడ్డ సత్తిగాడు కూడుండు.

పటేలు పానం ఒలల వడ్డ సేప పిల్ల లెక్క గిలగిల కొట్టుకుంది.

"నువ్వా, పటేలా! నువ్వుగడ గిటువంటి లంగ పనులు జేస్తెట్ల, పట్లా. మాకు బుద్ధిజెప్పె నువ్వు జేసిం దేంది?" అనుకుంట ఆళ్ళు ఎల్లి పోయింద్రు.

పటేలు పానాలు గాలిల గలిసినట్టయినయి.

మెల్లగ లస్మి దిక్కు జూసిండు. నవ్వుకుంట నిమ్మలంగా కొత్తసీర గట్టుకుంటున్నది.

"త్ఫూ! లంజే! నా పని జేస్తివి గదనే" అని మనసుల్నే అనుకొని మూల్గుకుంట ఇంటి మొగం బట్టిండు — పోలీస్ పటేలు. ★